క్లుప్తంగా

డ్రెయిన్ సమస్యను పరిష్కరిస్తా: పీవో



బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

కుక్కునూరు: కుక్కునూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో డ్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఐటీడీఏ పీవో సూర్యతేజ చెప్పారు. ఆదివారం కుక్కునూరు వచ్చిన ఆయన గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ రావు మీనా వినోద్ ఆశ్రమ వసతిగృహం పరిధిలో డ్రెయిన్ సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పీవో దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన సూర్యతేజ సమస్యను పరిష్కరించే దిశగా డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. డ్రెయిన్ నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసేందుకు అధికారులను పంపుతానని హామీ ఇచ్చారు.

నూకాలమ్మ సన్నిధిలో..



నూకాలమ్మ ఆలయంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ ఆలయాన్ని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి.వినోద్‌కుమార్, కవిత దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రతిష్ఠ విశేషాలు, నిత్య పూజా కైంకర్యాలు, చండీహోమం విశిష్టత గురించి ఆయనకు తెలియజేశారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రొంగల నాగేశ్వరరావు, ఏలూరి ఫణి కుమార్, కమిటీ సభ్యులు, ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు, భక్తులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లూ... సమాచారమివ్వండి

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ఆటోస్టాండ్‌లోని ఆటో డ్రైవర్లు అసాంఘిక శక్తుల సమాచారాన్ని తమకు ఇవ్వాలని, ఆటోలో నిషేధిత వస్తువులతో ప్రయాణించే వారి వివరాలు తెలియజేయాలని ఏలూరు రైల్వే ఎస్సై డీ.నరసింహారావు తెలిపారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. గంజాయి, అక్రమ మద్యం, నిషేధిత వస్తువులు ఏవైనా ఆటోలో ప్రయాణికులు తీసుకువస్తున్నట్లు మీకు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇక రైలులో ప్రయాణించే వ్యక్తుల బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లు, బంగారు నగలు, విలువైన వస్తువులను చోరీ చేసే వారి సమాచారం తెలిసినా రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రైల్వేలో ప్రయాణించేందుకు మీ ఆటోల్లో వెళ్లే వారి పట్ల గౌరవంగా నడచుకోవాలని సూచించారు. ప్రతి డ్రైవర్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆటో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ విధిగా కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలరించిన 'పాడనా తీయగా' కార్యక్రమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నూతన గాయకులను ప్రోత్సహించే నిమిత్తం నిర్వహించిన పాడనా తీయగా కార్యక్రమం నగర ప్రజలను విశేషంగా అలరించింది. ఆదివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక మంది వర్ధమాన గాయకులు తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించారు. వివిధ సినిమాల్లోని విజయవంతమైన గీతాలను శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి బుల్లితెర సంగీత దర్శక గాయకుడు డాక్టర్ చంటి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అనంతరం డాక్టర్ చంటిని సుస్వర సామ్రాట్ పురస్కారంతో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ గాయకునికి ఎస్‌పీఎస్ బెస్ట్ సింగర్ అవార్డును బహూకరించారు. మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ఎస్‌పీఎస్ వాసు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత ఎండీ ఖాజావలీ, మానవత సంస్థ ప్రతినిధి ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ఏలూరు రూరల్: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణురాలు పుచ్చల రాజేశ్వరి తన సిబ్బందితో కలిసి రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. అనంతరం అసోసియేషన్ ప్రెసిడెంట్ అక్బర్, కార్యదర్శి నాగ విఘ్నేశ్వరరావు డాక్టర్ పుచ్చల రాజేశ్వరిని ఘనంగా సన్మానించారు. కోశాధికారి విశ్వనాథ్ మాధవరావు, ఉపాధ్యక్షుడు కొమ్మా నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఎన్ జగదీష్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

- పోలవరం నియోజకవర్గంలో 8,516 మందికి లబ్ధి
- వడ్డీలేని రుణాలు రూ.8.5 కోట్లు జమ చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బుట్టాయగూడెం: ఒకరిపై ఆధారపడకుండా కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. నాడు చిరువ్యాపారులకు గత్యంతరం లేక వడ్డీ వ్యాపారుల మీదే ఆధారపడి జీవించాల్సి వచ్చేది. వ్యాపారం చేయడానికి 5 నుండి 6 రూపాయల వడ్డీకి అప్పులు తెచ్చి వాటికి వడ్డీ కట్టలేక దారుణమైన పరిస్థితులు ఎదుర్కొనేవారు. ఇటువంటి పరిస్థితులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర సమయంలో దగ్గరగా చూశారు, విన్నారు. అప్పుడు నేను విన్నాను.. నేను ఉన్నాను అంటూ చిరువ్యాపారులకు హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

8,516 మందికి రూ.8.5 కోట్లు జమ

జగనన్న తోడు పథకంలో అర్హులైన చిరువ్యాపారులకు ప్రభుత్వం రూ.10 వేలు వడ్డీలేని రుణాన్ని అందిస్తుంది. ఫుట్‌పాత్‌ల మీద, వీధి తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు, గంపలు, బుట్టలతో వస్తువులు విక్రయించేవారు, స్వీట్ షాప్స్, సంప్రదాయ చేతివృత్తి కళాకారులకు ఇలా అనేక మంది చిరు వ్యాపారులకి జగనన్న తోడు పథకం అండగా నిలిచింది. పోలవరం నియోజకవర్గంలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8,516 మందికి సుమారు రూ.8.5 కోట్లు వడ్డీలేని రుణాలను జమ చేశారు. తమకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన తోడ్పాటును ఎన్నటికీ మరువలేమని చిరు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ముప్పినవారిగూడెంలో కిరాణా షాప్ నడుపుతున్న సక్కుబాయమ్మ

స్వశక్తితో ఎదిగేందుకు తోడు



వ్యాపార అభివృద్ధికి పెట్టుబడి పెట్టేందుకు అప్పు కోసం కాళ్లు అరిగేలా తిరిగాను. అయినా ఫలితంలేదు. అయితే అనుకోకుండా జగనన్న తోడు పథకంలో వడ్డీ లేని రుణం అందింది. దీనితో నేను కూరగాయలు, కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. స్వశక్తితో ఎదిగేందుకు ఈ పథకం సహాయపడింది. మా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటుంది.

– టి.నాగరత్నం, చిరువ్యాపారి, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మండలం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నేను పండ్ల వ్యాపారం చేస్తున్నాను. నాకు జగనన్న తోడు ఆసరాగా నిలిచింది. నాడు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డీలేని రుణాలను అందిస్తూ మాకు భరోసా కల్పిస్తున్నారు. రూ.10 వేలు పెట్టుబడిగా పెట్టి మేము చేసే వ్యాపారంలో ఇబ్బంది లేకుండా ముందుకు సాగుతున్నాం. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు

– నందం పద్మ, చిరువ్యాపారి, ముప్పినవారిగూడెం, బుట్టాయగూడెం మండలం

పాముకాటు బాధితుడిని కాపాడిన వైద్యులు



చికిత్స పొందుతున్న సంపత్

కుక్కునూరు: పాముకాటుకు గురైన వ్యక్తికి సకాలంలో వైద్య సేవలందించి ప్రాణాలు కాపాడారు కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యులు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పరమద్దిగట్ల గ్రామానికి చెందిన మాటూరి సంపత్ ఆదివారం మిరప చేలో తడి పెడుతుండగా తాచు పాము కాటుకు గురయ్యాడు. విషయం తెలిసిన గ్రామస్తులు వెంటనే బాధితుడిని కుక్కునూరు పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తమై వైద్య సేవలందించి అతని ప్రాణాలను కాపాడారు. కాగా బాధితుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. సంపత్ పాముకాటు గురైన వెంటనే వైద్యసిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తం చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు రావు వినోద్‌కు, ప్రాణాలు కాపాడిన పీహెచ్‌సీ వైద్యులకు సంపత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. ఆదివారం మండలంలో తడికలపూడి, వీరిశెట్టిగూడెం, కామవరపుకోటలో వైఎస్సార్‌సీపీ నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్తూరు ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో మండల డ్రైవర్ యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కామవరపుకోటలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్‌బాబు ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్నారన్నారు. దీనితో రాష్ట్ర ప్రజలు సీఎం జగన్ వైపే చూస్తున్నారని అన్నారు. భీమిలిలో సీఎం జగన్ బహిరంగ సభకు తరలివచ్చిన జన సముద్రాన్ని చూసి టీడీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారన్నారు. మరలా రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమన్వయతో పనిచేసి భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపొందే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా ఫిబ్రవరి 3 తేదీన ఏలూరులో జరగబోయే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, రాష్ట్ర ముతరాజు సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, కనుమూరు అంజిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు

కూరగాయలతో ఆరోగ్య పరిరక్షణ



సదస్సులో మాట్లాడుతున్న విక్రమాదిత్య

జంగారెడ్డిగూడెం: జీవశక్తిని అందించే ఆహారంలో కూరగాయల పాత్ర ప్రముఖమైనదని, ఆరోగ్య సిరులు అందించే ప్రకృతి వరాలు కూరగాయలని ప్రముఖ వెజిటబుల్ థెరపిస్ట్, సన్ స్పిరిట్యువల్ సొసైటీ వ్యవస్థాపకులు విక్రమాదిత్య తెలిపారు. ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ నిర్వహణలో ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం పట్టణంలోని శేషాద్రినగర్ శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ మహా ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విక్రమాదిత్య కూరగాయల వాడకం ద్వారా ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై అవగాహన కలిగించారు. జీవించడం కోసం ఆహారం స్వీకరించాలని, ఆహారం స్వీకరణ కోసమే జీవితం అన్నట్లుగా మనుగడ సాగించడం ప్రమాదకరమన్నారు. తీసుకునే ఆహారం మితంగా పోషకవిలువలు కలిగి ఉండటం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాలు అందిస్తాయని అన్నారు. కేవలం పది గోరుచిక్కుళ్లు తీసుకోవడం మాంసకృత్తులకు ప్రత్యామ్నాయం అని, ఇదే రీతిలో బూడిద గుమ్మిడికాయ నుంచి సమస్త కూరగాయల వాడకం వాటి పనితీరు వివరించడంతో పాటు రాశులను బట్టి ఏ రాశివారు, ఏ కూరగాయలు, కషాయాలు ఎలా వాడాలో విక్రమాదిత్య సోదాహరణంగా వివరించారు. పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షులు కాకి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి తటవర్తి కృష్ణ, కొలనువాడ శిరీష, పాలడుగుల సురేష్, ఆరోగ్యాభిలాషులు, ధ్యానులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తృతం

కొయ్యలగూడెం: ఆరోగ్యశ్రీ సేవలు మారుమూల ప్రాంతాల్లో సైతం విస్తరించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ నిర్వహణకు అర్హత సాధించిన ప్రైవేట్ హాస్పిటల్స్ విజిట్‌లో భాగంగా ఆయన ఆదివారం కన్నాపురం రోడ్డులో ఉన్న సురక్ష హాస్పిటల్‌ను విజిట్ చేశారు. ఈ సందర్భంగా వైద్య విధానం, సిబ్బంది పనితీరుతో పాటు హాస్పటల్లో ఉన్న మౌలిక వసతుల గురించి హాస్పటల్ ఎండీ కొండముది దిలీప్ కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్లోని సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రస్టే ఆమోదించబడిన అనంతరం పదిహేను రోజుల్లో ఆరోగ్యశ్రీ సేవలు సురక్ష హాస్పిటల్‌లో ప్రారంభిస్తామన్నారు. ట్రస్టు సభ్యులు వైద్యాధికారులు పాల్గొన్నారు.



సురక్ష హాస్పిటల్‌లోని వనరులు, మౌలిక సదుపాయాలపై పర్యవేక్షిస్తున్న డాక్టర్ నవీన్

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

చింతలపూడి: ఆర్యవైశ్యులు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వజ్రపు శేఖర్ పిలుపునిచ్చారు. చింతలపూడి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్లో జరిగింది. జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు జల్లిపల్లి శివాజీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా వజ్రపు శేఖర్, కార్యదర్శిగా కొనకళ్ల ప్రసాద్, కోశాధికారిగా చిట్టూరి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా పట్టణ మహిళా అధ్యక్షురాలిగా కొనకళ్ల రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా కేతేపల్లి స్రవంతి, కోశాధికారిగా భవాని ఎన్నికయ్యారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా అడపా రాజారావు, ఉపాధ్యక్షులుగా చవ్వా శ్రీనివాస్, కార్యదర్శిగా కంభంపాటి నారాయణ, కోశాధికారిగా మాటూరి మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వజ్రపు శేఖర్

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయం

చింతలపూడి: పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయరావు అన్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో నూతన సర్కిల్ కార్యాలయం నిర్మాణంలో వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందించిన దాతలను సత్కరించి అభినందనలు తెలిపారు. పట్టణంలో మెయిన్ రోడ్డు పక్కన విలువైన స్థలం ఉన్నప్పటికీ దశాబ్దాలుగా సర్కిల్ కార్యాలయం నిర్మాణం చేపట్టలేకపోయామని, దీంతో చాలాకాలంగా అద్దె భవనంలోనే ఉండాల్సి వచ్చిందని అన్నారు. సీఐ మల్లేశ్వరరావు పట్టుదలగా సర్కిల్ కార్యాలయం నిర్మాణంలో భాగస్వాములయ్యి భవనాన్ని పూర్తి చేశారని కొనియాడారు. పోలీసులు కూడా ప్రజల పట్ల ఫ్రెండ్లీ పోలీసులుగా మెలగాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐలు ఎంవీఎస్ మల్లేశ్వర్రావు, ఎం సుధాకర్, ఎస్సైలు కె ప్రసాద్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్పీ ధనుంజయరావు

చురుగ్గా కుల గణన సర్వే

భీమడోలు: మండలంలో కుల గణన సర్వే చివరి దశకు చేరుకుంది. ప్రభుత్వం కుల గణనలోని సామాజిక, ఆర్థిక అంశాలపై ఆదివారంతో సర్వే పూర్తి చేయాలని ఆదేశించింది. మండల వ్యాప్తంగా 23,030 కుటుంబాల్లో 62,957 మంది ఉండగా ఇప్పటి వరకు 89.03 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన 10 శాతం సర్వే త్వరితగతిన పూర్తి చేస్తామని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు అడిగి నమోదు చేశారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



లక్కవరంలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలన చేస్తుందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం ఎస్సీ ఏరియాలో రూ.3 లక్షల నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకటరమణ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిమ్మ గురునాథరెడ్డి, దల్లి నాగేశ్వరరావు, మన్నెల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. అప్పనవీడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరుల నుంచి రూ.1,060 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై కే శుభశేఖర్ తెలిపారు.

పార్టీలో కష్టపడి పనిచేస్తే సముచిత స్థానం



వైఎస్సార్ సీపీ నేతలతో కంభం విజయరాజు, కారుమూరి సునీల్ కుమార్



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

లింగపాలెం: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం వైఎస్సార్‌సీపీ నేత బీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో లింగపాలెం గెస్ట్ హౌస్‌లో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా విజయరాజు, సునీల్‌కుమార్ నాయకులు కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మీకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయండి అని చెప్పిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా కలసి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. తాము అందరికీ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేసి విజయరాజు, సునీల్‌కుమార్‌లను గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మందలపు సాయిబాబు, ముసునూరి వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వరప్రసాద్, మట్టా సురేష్, అన్నపనేని శాంతారావు, రావి కొండయ్య, కర్లపూడి ఆనంద్, కట్టా సత్యనారాయణ, పి.వేమనరెడ్డి, బి.సోమిరెడ్డి, ప్రభాకరరెడ్డి, మందలపు నరసింహరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు 'మన ఊరు మన వార్డు' కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 3వ వార్డులో సోమవారం మన ఊరు, మన వార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. పట్టణ అభివృద్ధే లక్ష్యంగా వార్డుల్లో మన ఊరు, మన వార్డు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొని ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటారన్నారు. 2వ సచివాయం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.

పీఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2024 సంవత్సర నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సొసైటీ చేపట్టిన అభివృద్ధి, అదే విధంగా రైతాంగానికి అందజేసిన రుణాల వివరాలతో పాటు 2024–25 సంవత్సరానికి గాను పీఏసీఎస్ విస్తరణ లక్ష్యాలను, రుణాల మంజూరు త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్ గొడ్డటి రాణి వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి సహకార సంఘాల వ్యవస్థ ఆధునీకరించిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే బాజీ, రాజనాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు మల్లాది నారాయణ శర్మ త్యాగరాజ వేషధారణలో నగరంలోని రామచంద్రరావు పేట వీధుల్లో ఊంఛ వృత్తి నిర్వహించారు. ఫైన్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి సావిత్రి, దువ్వి హేమ సుందర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుడిపాటి లలితా శర్మ, మేడూరి శివరాం, రఘురాం సోదరులు, పార్వతి రామచంద్రన్, ద్రోణంరాజు శైలజ, వేదుల జయలక్ష్మి, శిరీష, పీవీఆర్ఆర్‌కే శాస్త్రి, మైలవరపు గురు శర్మ పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో జాతర కోలాహలం



జల్లికొమ్మర ఆరాధ్య దైవం గోగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గణపవరం: గణపవరం మండలం జల్లికొమ్మర గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, గ్రామ దేవత గోగులమ్మవారి జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం అమ్మవారికి నైవేద్యాల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అల్లుళ్లు ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామం జనంతో కిటకిట లాడింది. ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడింది. గ్రామానికి వెళ్లే రోడ్లన్నీ ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లతో నిండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆదివారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరులు చినబాబు, కన్నబాబు, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, పార్టీ ప్రముఖులు కాకర్ల శ్రీను, వివిధ పార్టీల నియోజకవర్గ నాయకులు, సర్పంచ్‌లు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి సేవ నిర్వహించి, పూజల అనంతరం నైవేద్యాల సమర్పణ కార్యక్రమం ప్రారంభించారు. ఆలయం వద్ద పంబరులతో అమ్మవారి కథలు చెప్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.